ఎంబీఏ విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలు



సెమినార్‌లో డాక్టర్ సందా శ్రీదేవి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎంబీఏ విద్యార్థులకు దేశవ్యాప్తంగా మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సందా శ్రీదేవి అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంబీఏ కళాశాలలో 'బోధన పద్ధతుల్లో నైపుణ్యాలు–ఎంబీఏ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు' అనే అంశంపై శనివారం సెమినార్ జరిగింది. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన పద్ధతుల్లో కూడా మార్పు రావాలన్నారు. ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పలయ్య మీసాల మాట్లాడుతూ.. విద్యార్థులు తమలో నైపుణ్యాన్ని మరింత పెంచుకోవాలన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నేతలు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో చేరిన కాంగ్రెస్ నేతలు శివకుమార్ తదితరులు

కాచిగూడ: హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత శివకుమార్ తన అనుచరులతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, ప్రసాద్, హిమాయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కె.నర్సింగ్ ముదిరాజ్, కె.నరహరి, నర్సింగ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్‌లో విద్య, వైద్యానికి 20 శాతం కేటాయించాలి



మాట్లాడుతున్న దాసురాం నాయక్, అంసోల్ లక్ష్మణ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన దాసురాం నాయక్, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మహమూద్ ఫైమొద్దీన్‌కు శనివారం సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. జాతీయ అధ్యక్షుడు దాసురాం నాయక్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 9న జరగబోయే 'జైల్ బరో' ఆందోళనలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, అంజయ్య, కార్యదర్శి ఇనాక్, గటియానాయక్, శ్రీనివాస్, మట్టి ప్రసాద్, రేవల్లి శంకర్ పాల్గొన్నారు.


భారతీయ సంస్కృతి గొప్పది



హోమం చేస్తున్న వీణాపానీ శాస్త్రి

ముషీరాబాద్: భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని ప్రముఖ గాయకుడు సీహెచ్.త్రినాథరావు అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని ప్రసిద్ధిగాంచిన భవానీ శంకర ఆలయంలో వీణాపాని శాస్త్రి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాశీ అన్నపూర్ణ సమారాధన, అభిషేకం, హోమాలు, అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు భక్తిగీతాలను ఆలపించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆకట్టుకున్న గ్రాడ్యుయేషన్ డే



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

ముషీరాబాద్: గంగపుత్ర కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాత్రయితే చాలు.. చిమ్మ చీకట్లే..!

జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో వెలగని లైట్లు

- శుభకార్యాలకు ఆటంకంగా మారిన వైనం
- మరోవైపు తాగుబోతులకు అడ్డాగా..
- ఇబ్బందుల్లో ప్రజలు, స్థానికులు





చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గంలోనే గాంధీనగర్ డివిజన్‌లో గల అతి పెద్ద జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో అంధకారం నెలకొన్నది. జీప్లస్–2 విశాలమైన భవనంలో జీహెచ్ఎంసీ ఆ.దీనంలో నడుస్తున్న ఈ కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్ లైట్లు వెలగక రాత్రయితే చాలు చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన బుట్టదాఖలు చేస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కమ్యూనిటీహాల్‌లోనే అరుంధతీనగర్, సబర్మతీనగర్, అన్నానగర్, నేతాజీనగర్, వాల్మీకినగర్, వి.వి.గిరినగర్, జవహర్‌నగర్, ఎల్లయ్య బస్తీ, వివేకానందనగర్, తదితర బస్తీల కాలనీవాసులు వివాహాలు, శుభకార్యాలు వంటివి చేస్తుంటారు. అయితే లైట్లు వెలగకపోవడంతో రాత్రుల్లో ఫంక్షన్లు చేసేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోవైపు రాత్రి అయితే తాగుబోతుల ఆగడాలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, మినీహైమాస్ట్‌లైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేయని మినీ హైమాస్ట్ లైట్లు



మెయిన్ గేట్ వద్ద అలంకారప్రాయంగా లైట్

లైట్లు వెలిగేలా చూడాలి..



జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి అంతా చీకటిగా ఉంటోంది. అంతేగాకుండా ఇక్కడ ఏర్పాటు చేసిన మినీ హైమాస్ట్ లైట్ కూడా నెలలు గడుస్తున్నా అలంకారప్రాయంగానే మిగిలింది. ఇదే అదునుగా కొందరు ఇక్కడే మద్యం సేవిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేసి మందుబాబుల ఆగాడాలను అరికట్టాలి.

– నర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



కమ్యూనిటీ హాల్‌లో లైట్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే జోనల్ కమిషనర్, విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినం. అంతేగాకుండా జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాల్లోనూ ఈ సమస్యతో పాటు వాచ్‌మెన్‌ను నియమించాలని గళమెత్తిన. అధికారులు కూడా త్వరగా స్పందించి తగు చర్యలు చేపట్టాలి.లేకుంటే స్థానికులతో కలిసి ఆందోళనలు చేపడుతాం.

– ఎ.పావనీవినయ్‌కుమార్, గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్

నిధుల ఖర్చుపై అసెంబ్లీలో చర్చించాలి



మాట్లాడుతున్న గుమ్మడి సూర్యకిరణ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేటాయించిన నిధుల ఖర్చులపై ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చించాలని గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి గుమ్మడి సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. డి.బి.ఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ..అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టడంతో పాటు ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డి.బి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె.వి.పి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. దశరథ్, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ కన్వీనర్ ఎస్ శివలింగం, వెంకటేశ్ చౌహాన్, మామిడి నారాయణ, డి. మోహన్, చుంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలి'

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైం పోలీసు కస్టడీలో మృతిచెందిన పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన అలకుంట సంపత్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ కోరారు. బాగ్‌లింగంపల్లిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంపత్ మ్యాన్‌పవర్ సప్లై లైసెన్స్‌తో కొంతమందిని గల్ఫ్‌దేశాలకు పంపారని అయితే అక్కడ సరైన ఉపాధి అవకాశాలు కల్పించలేదనే నెపంతో కొందరు నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. సంపత్‌ను అరెస్టు చేసి రిమాండ్ చేసిన పోలీసులు మళ్లీ కోర్టు ద్వారా కస్టడీకి తీసుకుని తీవ్రంగా మానసికంగా, భౌతికంగా హింసించడం వల్లే మృతిచెందాడని బంధువులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేసి సంబంధిత పోలీసు అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అలాగే బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నారగోని తదితరులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ ధర్మ సమాజ్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో రోటరీ కాలనీలో కాన్షీరాం 91వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ధర్మసమాజ్ పార్టీ కవాడిగూడ ఇన్‌చార్జి జి. సంతోష్ మహారాజ్ హాజరై మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు అధికారమే లక్ష్యంగా కాన్షీరాం కృషిచేశారన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు శివగౌడ్, రమేశ్, రోటరీ కాలనీవాసులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో..

కాచిగూడ: పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ విజిఆర్ నారగోని ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో శనివారం కాన్షీరాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కేబీ శ్రీధర్, జీఏ నేతాజీ, ఎంబీ గోపి, నాగుల శ్రీనివాస్ యాదవ్, జగదీశ్ యాదవ్, లక్ష్మణ్, ఎం.నర్సయ్య, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రోటరీ కాలనీలో కేక్ కట్ చేస్తున్న నాయకులు సంతోష్ తదితరులు

బీసీల పక్షపాతి సీఎం రేవంత్



సభలో మాట్లాడుతున్న మెట్టు సాయికుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పక్షపాతి అని తెలంగాణ ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ తెలంగాణ రాష్ట్ర ఆధ్వర్యంలో రజకుల జన శంఖారావం పేరిట రజకుల ఆత్మగౌరవ సభ శనివారం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రజకులంతా తమ లక్ష్య సాధన కోసం ముందుకు సాగాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కోరారు. రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆమనగంటి సైదులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజీవ్‌కుమార్, కార్యదర్శి సీహెచ్ రామస్వామి, ఉపాధ్యక్షుడు గజ్జల నాగరాజు, చంద్రశేఖర్, ఎన్ రాజశేఖర్, నేరెళ్ల కుమార్, పుప్పాల యాదయ్య, మహిళా అధ్యక్షురాలు దుర్గా, మంగా తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి'

కాచిగూడ: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. కోల జనార్దన్ అధ్యక్షతన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్‌నేత వి.హనుమంతరావు, బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, టీ టీడీపీ జాతీయ నాయకుడు అరవింద్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేతలు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం తదితరులు పాల్గొని ప్రసంగించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టనున్న బీసీ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో మన ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వేముల రామకృష్ణ, నీల వెంకటేశ్, తంగెళ్లముడి నందగోపాల్, ఉదయ్‌నేత, సుందర్ రాజ్, వంశీకృష్ణ, వేణు, సుధాకర్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

సత్యంను పరామర్శించిన ముఠా జైసింహ

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సోషల్ మీడియా నాయకుడు దోనేటి సత్యం ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది నివాసానికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు ముఠా జైసింహ శనివారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ఆలయ మాజీ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రాజ్యస్థాపనకే 'మా భూమి రథయాత్ర'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశారదన్ మహారాజ్

కాచిగూడ: తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకే లక్ష కిలోమీటర్ల 'మా భూమి రథయాత్ర'ను నిర్వహించనున్నట్లు ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ తెలిపారు. బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో సంబంధిత పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి రోజున 14న ఆదిలాబాద్‌లో యాత్ర ప్రారంభమై 3 ఏళ్ల 3 నెలల పాటు కొనసాగుతుందని హైదరాబాద్ జింఖాన గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నేతలు దుర్గాప్రసాద్, తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్, రాజ్యాధికార సాధన జేఏసీ ప్రతినిధులు రాఘవేంద్ర ముదిరాజ్, వినోద్ యాదవ్ రాసాల, అబ్దుల్ రెహమా, సాయిబాబా, హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ కులస్తులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి సుందరయ్య పార్కు వరకు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గజ్జల రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ నరేశ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన సీఎం ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణను వర్తింపజేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చి ఇప్పుడు వర్గీకరణ అమల్లోకి రాకముందే టీచర్ ఉద్యోగాలను భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గజ్జల రాజశేఖర్ మాదిగ, బొర్రా భిక్షపతి, టి.వి నర్సింహ, డప్పు మల్లికార్జున్, గండి కృష్ణ, చిలక ఎల్లయ్య, తొట్ల గోపి, కుమ్మరి శ్రీనివాస్, దశరథ్ పాల్గొన్నారు.

సినారె సేవలు ఎనలేనివి

చిక్కడపల్లి: తెలుగు సాహిత్యానికి సి.నారాయణరెడ్డి చేసిన ఎనలేనివని ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. త్యాగరాయగాన సభలో వంశీ ఆర్ట్ థియేటర్స్ వంశీ , ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ కవి సినారె తొలి గీత రచన చేసి 65 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాటకు పట్టాభిషేకం శీర్షికతో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గేయ కథా ప్రక్రియను బాటవేసి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందిన సాహిత్యం విశ్వజనీనమన్నారు. ప్రముఖ రచయిత్రి జలంధరచంద్రమోహన్ మాట్లాడుతూ.. సినారె రాసిన పాట బహుళప్రాచుర్యం పొందాయన్నారు. ఈ సందర్భంగా గాయనీగాయకులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు,డి.ఎ. మిత్ర, శివశంకరి గీతాంజలి, కృష్ణప్రసాద్, ఇందునయన, మాస్టర్ విజయ్, సుధామయి పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్

కాచిగూడ: బర్కత్‌పురలో వర్షపునీటి పైపులైన్ పనులతో తాగునీటి సరఫరా పైపులైన్ పగిలి నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో స్పందించిన కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్‌యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శనివారం పైపులైన్ పనులను పరిశీలించారు. వెంటనే పైపులైన్ పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్, బీజేపీ నేతలు సుందర్, కృష్ణ, రామన్న, బి.భీమ్‌రాజ్, చందు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరానగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీహాల్ భవనం పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే సిద్ధిఖీనగర్, తాజీర్‌నగర ఇందిరానగర్ సెకండ్ వెంచర్, గుల్షన్‌నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని, రాంనగర్ ఎంబీ చర్చి వీధిలో రోడ్డు పనులు వెంటనే చేపట్టాలన్నారు.

వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆస్రా వ్యవస్థాపకుడు హబీబ్ సుల్తాన్ అలీ

కాచిగూడ: వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించాలని అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆస్రా) వ్యవస్థాపకుడు హబీబ్ సుల్తాన్ అలీ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆస్రా ప్రతినిధులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ ప్రారంభమైన నుంచి ఇప్పటి వరకు ఎన్నో కేసులు పరిష్కరించామన్నారు. ప్రభుత్వం వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లు, ప్రచారాలు నిర్వహించాలన్నారు. అలాగే ఫిర్యాదుల పరిష్కార విధానం, వినియోగదారుల కోర్టుల్లో వేగంగా వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. డిజిటల్ వినియోగదారుల రక్షణ, ఆన్‌లైన్ మోసాల నివారణ, డేటా భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆస్రా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ గుప్తా, హరీ కుమార్, శివకుమార్, వీరేష్, శ్రీధన్య, ప్రశాంత్, కైలాష్, బీఎస్ఎస్ రాజు, రంజిత్ కుమార్, ప్రవీణ, మహబూబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగంలో వెనుకబడిన తెలంగాణ'



సమావేశంలో పాల్గొన్న వక్తలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో వెనుకబడి ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మదర్స్ అసోసియేషన్, దళిత బహుజన ఫ్రంట్, ఎంపీ ఫౌండేషన్, సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి, కనగంటి రవి, శంకర్, ప్రసన్న హరికృష్ణ మాట్లాడారు. దేశంలో విద్యారంగానికి బడ్జెట్‌లో సగటున 15 శాతం కేటాయిస్తుంటే, తెలంగాణలో మాత్రం 7.3 శాతమే కేటాయిస్తున్నారన్నారు. బడ్జెట్ తక్కువగా ఉండడం వల్ల ఏటా 1000 ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని, దీంతో నిరుపేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణతో పాటు విద్యా ప్రమాణాల పర్యవేక్షణ ఉండాలన్నారు.